# నాకు గౌరవమే ముఖ్యం



**ప్రస్తుతం** ప్రపంచమంతా అంబానీ ఇంట పెండ్లి వేడుక గురించే చర్చిస్తున్నది. అంగరంగ వైభవంగా జరిగిన పెండ్లి సందడికి బాలీవుడ్, టాలీవుడ్ సెలెబ్రిటీలు తరలి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన హేమాహేమీలు ఎందరో హాజరయ్యారు. బాలీవుడ్ స్టార్లయితే స్టెప్పులు కూడా వేశారు. ఈ సందడిపై ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కూతురు ఆలియా కశ్యప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.'నన్ను ఓ భారీ ఈవెంట్‌కు ఆహ్వానించారు. కానీ, వారితో నేను రానని స్పష్టంగా చెప్పాను. ఎందుకంటే నాకు ఆత్మగౌరవం ఉంది. ఒకరి పెండ్లిలో నన్ను నేను అమ్ముకోవడం కంటే నాకు గౌరవమే ముఖ్యం. ఆ వివాహానికి ఎన్నిసార్లు ఆహ్వానించినా తిరస్కరించాను. అది పెండ్లిలా కాకుండా సర్కస్‌లా మారింది' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆమె కామెంట్స్‌పై నెటిజన్లు ఒక్కొక్కరూ ఒక్కోరకంగా స్పందిస్తున్నారు. ఎవరేం అనుకున్నా.. తన ఫీలింగ్ అదేనని చెబుతున్నది ఆలియా.

# ఓటీటీ యూటర్న్

**ఓటీటీ** వచ్చిన తర్వాత నిర్మాతలకు మంచి రోజులు వచ్చాయనే చెప్పాలి. చిన్న, మధ్యస్థాయి సినిమాలు కూడా ఓటీటీ పుణ్యమా అని డబ్బులు రాబట్టుకుంటున్నాయి. ఇక, కొన్ని సినిమాలు అయితే నేరుగా ఓటీటీలో విడుదలై సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారుతున్నాయని చెప్పుకొచ్చింది తాప్సీ పన్ను. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో కొన్ని ఇంతకుముందులా అన్ని సినిమాలు తీసుకునేందుకు ఆసక్తి చూపించడం లేదని పేర్కొన్నది. 'స్టార్ నటీనటులు లేకపోయినా, బాక్సాఫీస్ దగ్గర అంతగా కలెక్షన్లు రాకపోయినా.. ఓటీటీ ఉందన్న ధైర్యం నిర్మాతలకు ఉండేది. అయితే, ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ యూటర్న్ తీసుకుంటున్నాయి. ప్రతి సినిమాను కొనుగోలు చేసి స్ట్రీమింగ్ చేయలేమని చెబుతున్నాయి. స్టార్ నటులు లేని సినిమాలను ప్రమోట్ చేయలేమని చేతులు ఎత్తేస్తున్నాయి. చిన్న సినిమాలను ప్రేక్షకులు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో చూసేలా ఆకర్షించడం కష్టమని అంటున్నాయి. ఎంతో కొంత ప్రమోషన్ చేసి థియేటర్లలో విడుదల చేయాలని, ఆ తర్వాత కొన్నిరోజులకు ఆ సినిమాను ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకుంటామని స్పష్టంగా చెప్పేస్తున్నాయి' అని చెప్పుకొచ్చారు తాప్సీ.





# భక్తిపథంలో.. సాంఘిక చిత్రం

**సాంఘిక కథాంశాలకు భక్తిరస, ఐతిహాసిక అంశాలను జోడించి సినిమాలను రూపొందించే ట్రెండ్ ఇటీవలి కాలంలో ఎక్కువైంది. ఇప్పుడున్న సాంకేతికతను అందిపుచ్చుకొని వెండితెరపై ఓ సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్న ఈ తరహా చిత్రాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. కార్తికేయ-2, హనుమాన్, కాంతార, కల్కి వంటి చిత్రాలు సాధించిన అద్భుత విజయాల స్ఫూర్తితో సోషియో ఫాంటసీ డివోషనల్ జానర్ చిత్రాల నిర్మాణం మరింతగా ఊపందుకుంది. ప్రస్తుతం తెలుగులో పదుల సంఖ్యలో ఈ తరహా చిత్రాలు సెట్స్ మీద ఉన్నాయి. బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురుస్తుండటంతో సోషల్ ఫిల్మ్స్‌విత్ డివోషనల్ ఎలిమెంట్స్ జానర్ ఇప్పుడు టాలీవుడ్ ట్రెండ్ అవుతున్నది.**

**శ్రీ**కృష్ణుడి చరిత్ర, ద్వారక నేపథ్యంలో రూపొందించిన 'కార్తికేయ–2', దక్షిణ కన్నడ ప్రజల భూత కోల ఆరాధన కథాంశంతో వచ్చిన 'కాంతార', హనుమంతుడి మహిమల నేపథ్యంలో తెరకెక్కిన 'హనుమాన్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించాయి. దేవుడి కాన్సెప్ట్ చుట్టూ అల్లుకున్న ఈ కథలు ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేశాయి. కాంతార, హనుమాన్ చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో రూ.300 కోట్లకుపైగా వసూళ్లు సాధించడానికి ఆ చిత్రాల్లోని భక్తి కోణమే కారణం. ప్రస్తుతం ఈ మూడు చిత్రాలకు సీక్వెల్స్ సన్నాహాలు జరుగుతున్నాయి. 'కాంతార' ముందు జరిగిన కథతో 'కాంతార చాప్టర్ 1' పేరుతో



ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. కొద్దిమాసాల క్రితం విడుదల చేసిన ఫస్ట్‌లుక్ టీజర్ దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ డివోషనల్ థ్రిల్లర్‌ను భారీ గ్రాఫిక్స్‌తో తెరకెక్కిస్తున్నారు. దక్షిణాది నాలుగు భాషలు, హిందీతోపాటు బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో కూడా ఈ ప్రీక్వెల్‌ను విడుదల చేస్తామని చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టి తెలిపారు.

**ఇక** 'హనుమాన్' చిత్రానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా కథ మొత్తం హనుమాన్ పాత్ర చుట్టే నడుస్తుందట. ఓ అగ్ర హీరో హనుమాన్ పాత్రను పోషిస్తారని ప్రచారం జరుగుతున్నది. హనుమాన్ పాత్ర కోసం చిరంజీవి, రామ్‌చరణ్‌కే తమ తొలి ప్రాధాన్యం అని ఇటీవల చిత్ర నిర్మాత పేర్కొనడంతో 'జై హనుమాన్' అందరిలో ఉత్సుకతను పెంచుతున్నది. 'కార్తికేయ–3' చిత్రానికి కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. 'కార్తికేయ–2'లో కృష్ణతత్వాన్ని నేపథ్యంగా తీసుకున్న దర్శకుడు చందు మొండేటి మూడో భాగంలో మరో భక్తి కోణాన్ని ఎంచుకోనున్నారని తెలుస్తున్నది.

**ఇటీవల** విడుదలైన ప్రభాస్ 'కల్కి' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో అపూర్వ ఆదరణ సొంతం చేసుకుంది. శనివారంతో ఈ సినిమా వెయ్యికోట్ల క్లబ్‌లోకి చేరింది. తెలుగు తెరపై పౌరాణిక, ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ అంశాలతో వచ్చిన తొలి చిత్రం 'కల్కి' కావడం విశేషం. మూడు భిన్న ప్రపంచాల నేపథ్యంలో మహాభారత కథను అనుసంధానం చేసిన తీరు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నది. ఇప్పటికే సీక్వెల్ కొంత భాగం షూటింగ్ పూర్తయింది. కర్ణుడు, అశ్వత్థామ ప్రధాన పాత్రధారులుగా సీక్వెల్ ఉండబోతున్నది. కథానుగుణంగా 'కల్కి' పాత్రను రెండో భాగం పతాక ఘట్టాల్లో పరిచయం చేస్తారని సమాచారం. మూడోభాగం మొత్తం 'కల్కి' పాత్రధారి చుట్టూ కథ నడుస్తుందని చెబుతున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో 'కల్కి–2' ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం ఉంది.

**'పేపర్‌బాయ్'** ఫేమ్ జయశంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అరి' చిత్రంలో కూడా డివోషనల్ ఎలిమెంట్ ఉంటుందని చెబుతున్నారు. అరిషడ్వర్గాల కాన్సెప్ట్ ఆధారంగా సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో శ్రీకృష్ణుడి పాత్ర నేపథ్యంలో కొన్ని సన్నివేశాలు ఉంటాయని సమాచారం. సుమంత్ హీరోగా రానున్న 'మహేంద్రగిరి వారాహి' చిత్రాన్ని కూడా భక్తి అంశాలతో తెరకెక్కిస్తున్నారు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో హాస్యబ్రహ్మ బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్నారు.

**నిఖిల్** కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయం భూ'లో సైతం డివోషనల్ అంశాలు ఉంటాయని తెలుస్తున్నది. ఇందులో హీరో నిఖిల్ లెజెండరీ వారియర్ పాత్రలో కనిపించనున్నారు. కథానుసారం ఆయన ఆంజనేయ భక్తుడిగా కనిపిస్తాడని, ఆయన ఆరాధన ద్వారానే ప్రత్యేక శక్తులను పొంది శత్రువధ చేస్తాడని చెబుతున్నారు. మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం చారిత్రక భక్తి రసాత్మక కథాంశంతో రూపొందిస్తున్నారు. ప్రబంధ కవి ధూర్జటి రాసిన 'శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం' ఆధారంగా ఈ చిత్రానికి రూపకల్పన చేస్తున్నారు. ఇందులో కన్నప్ప పాత్రలో మంచు విష్ణు నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ పాన్ ఇండియా చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, ప్రభాస్ వంటి అగ్ర తారాగణం భాగం కావడం విశేషం. ప్రేక్షకులను భక్తిరస ప్రపంచంలో ఓలలాడించే చిత్రమిదని, సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించామని మంచు విష్ణు తెలిపారు.

**డివోషనల్** టచ్ ఉన్న కథాంశాలు బాక్సాఫీస్ వద్ద హిట్ ఫార్ములాగా మారడంతో ఔత్సాహిక దర్శకులు కూడా ఈ తరహా కాన్సెప్ట్స్ పట్ల మక్కువ చూపుతున్నారు. భవిష్యత్తులో సాంఘిక, భక్తిరస, ఆధ్యాత్మిక అంశాలు కలబోసిన కథాంశాలతో మరిన్ని చిత్రాలు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇలా తెలుగు సినిమా భక్తిపథంలో సాంఘిక కథలను అసాధారణంగా నిర్మిస్తూ.. ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటున్నది.

... సినిమా డెస్క్



# ఆందోళనతో కుంగిపోయా



**బిగ్‌బాస్ 16తో** పాపులారిటీ సంపాదించుకున్న నటి నిమృత్ కౌర్ అహ్లూవాలియా. 'చోటి సర్దార్ని' టీవీ షోతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు బిగ్‌బాస్ షోలో స్పెషల్ అట్రాక్షన్‌గా సందడి చేసింది. నటిగా ఎదగాలంటే అంత తేలిక కాదని, దానికి ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని చెబుతున్నది నిమృత్ కౌర్. ఒక సమయంలో తాను చాలా డిప్రెషన్‌కు గురయ్యానని, దాన్నుంచి బయటపడేందుకు ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పుకొచ్చింది. 'టీవీ సీరియల్ షూటింగ్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. దాంతో ఆందోళనకు గురవుతుండేదాన్ని. ఒకానొక దశలో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. దాన్నుంచి బయటపడటానికి 40 రోజులు విరామం తీసుకున్నాను. ప్రస్తుతం సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చే పనిలో బిజీగా ఉన్నాను' అని చెప్పుకొచ్చింది ఈ యంగ్ బ్యూటీ.

# ఇది అంతకుమించి

**ఓటీటీలో** సూపర్ క్రేజ్ తెచ్చుకున్న సిరీస్‌లలో మీర్జాపూర్ ఒకటి. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, షెర్నావాజ్ సామ్ జిజినా తదితరులు నటించిన ఈ సిరీస్ మూడో భాగం స్ట్రీమింగ్ ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో మొదలైంది. ప్రస్తుతం టాప్ 5లో ట్రెండింగ్ అవుతున్నది. కాగా, గత రెండు సీజన్లతో పోలిస్తే మూడో సీజన్‌ను భిన్నంగా తెరకెక్కించాడు దర్శకుడు. ఈ సిరీస్‌లో ముఖ్య పాత్ర పోషించిన షెర్నావాజ్ సామ్ జిజినా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'మీర్జాపూర్ మూడో సీజన్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. నాలుగో సీజన్ కూడా ఉంటుంది. దానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. ఈ మూడు భాగాల కంటే మెరుగైన, ఆసక్తికరమైన స్క్రిప్ట్ తయారు చేస్తున్నారని అనుకుంటున్నాను. ప్రేక్షకులను అలరించే మరిన్ని అంశాలు నాలుగో భాగంలో ఉంటాయని ఆశిస్తున్నాను. అన్ని సీజన్లలోనూ హింస ఉండకూడదు. అందుకే బలమైన రాజకీయ కోణంతో మూడో సీజన్ తెరకెక్కింది' అని చెప్పుకొచ్చింది షెర్నావాజ్.



# రాజకీయ రణరంగం

## మీర్జాపూర్ సీజన్–3

ఓటీటీ హిట్

**ఓటీటీ:** అమెజాన్ ప్రైమ్
**నటీనటులు:** పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, శ్వేత త్రిపాఠి, ఇషా తల్వార్, విజయ్ వర్మ
**దర్శకత్వం:** గుర్మీత్ సింగ్, ఆనంద్ అయ్యర్

క్రైమ్, యాక్షన్, రొమాంటిక్, వయొలెన్స్ కలగలుపుగా తెరకెక్కిన మీర్జాపూర్ వెబ్‌సిరీస్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇప్పటికే విడుదలైన రెండు సీజన్‌లు వెబ్‌సిరీస్ నిర్వచనాన్నే మార్చేశాయి. కథ, కథనాల పరంగా మూడోసీజన్ కూడా హిట్ టాక్ సొంతం చేసుకుంది. పదవి, అధికారం అనేవి తలకెక్కితే ప్రాణాలు కోల్పోవడానికైనా రెడీ అవుతారు. కానీ అధికారాన్ని వదులుకునేందుకు ఇష్టపడరన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్నది మీర్జాపూర్ థర్డ్ సీజన్.



మొదటి రెండు సీజన్లకు కొనసాగింపుగా మూడో సీజన్ మొదలవుతుంది. గుడ్డు (అలీ ఫజల్), గోలు (శ్వేత త్రిపాఠి) చేసిన దాడిలో మున్నా (దివ్యేందు) చనిపోగా.. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి) తీవ్రంగా గాయపడి అదృశ్యమవుతాడు. దీంతో మీర్జాపూర్ సింహాసనాన్ని దక్కించుకునే క్రమంలో.. పూర్వాంచల్‌లో ప్రతీ దాన్ని శాసించే శక్తిగా ఎదగాలనుకుంటాడు గుడ్డు. కాలీన్ గుర్తులు లేకుండా చెరిపేసేందుకు ప్రయత్నిస్తాడు. మున్నా మరణంతో మాధురి యాదవ్ (ఇషా తల్వార్) రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతుంది. కనిపించకుండా పోయిన కాలీన్ భయ్యాపై సింపథీ క్రియేట్ చేసి, ప్రజలకు చేరువ కావాలని ప్లాన్ చేస్తుంది. మరోవైపు గుడ్డూ దాడిలో గాయపడిన కాలీన్‌ను శరద్ శుక్లా (అంజుమ్ శర్మ) కాపాడి, అతడి సహాయంతో మీర్జాపూర్ కుర్చీని దక్కించుకోవాలనుకుంటాడు. వీరిలో ఎవరు మీర్జాపూర్ సింహాసనాన్ని దక్కించుకుంటారు అనేది సిరీస్ కథ.

మొదటి రెండు సీజన్ల మాదిరిగా మూడో సీజన్ ఉత్కంఠ రేకెత్తించలేదని చెప్పాలి. రెండు సీజన్లలో ఉన్న యాక్షన్ ఎపిసోడ్స్, డైలాగ్స్‌లోని వాడివేడి మూడో సీజన్‌లో లేవు. పవర్‌ఫుల్‌గా కనిపించే కాలీన్ భయ్యాను ఈ సీజన్‌లో మంచానికే పరిమితం చేయడం మైనస్ అయింది. ఎనిమిదో ఎపిసోడ్ నుంచి మొదలయ్యే అసలు కథతో సిరీస్ వేగం పుంజుకుంటుంది. చివరి ఎపిసోడ్ సిరీస్ మొత్తానికి కీలకం. క్లైమాక్స్‌లో ఊహించని ట్విస్ట్ ఇచ్చి నాలుగో సీజన్‌పై ఆసక్తి పెంచారు దర్శకుడు.